క్లుప్తంగా

కొనసాగుతున్న నల్లాల సర్వే



వివరాలు సేకరిస్తున్న కార్యదర్శి రమేశ్ రాథోడ్

దుద్యాల్: గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం తాగు నీటి సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నల్లాల సర్వే కొనసాగుతుంది. నల్లా ఉన్న ఇంటి యజమాని ఆధార్ కార్డు నంబర్ లింక్ చేస్తున్నారు. మంగళవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి రమేశ్ రాథోడ్ ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక ఇంటికి ఒకే నల్లా ఉండాలి.. అలా అయితేనే అందరికీ సమానంగా నీటి సరఫరా చేయడం సులభమన్నారు. అలాగే, నీరు సరఫరా సమయంలో నల్లాలకు బోరు మోటార్లు పెట్టకుండా నీటిని పట్టుకోవాలని ప్రజలకు సూచించారు.

మురుగు.. పరుగు



రోడ్డుపై పారుతున్న మురుగునీటిని చూపిస్తున్న కాలనీమహిళాలు

పరిగి: మురుగునీరు రోడ్డుపై పారడంతో కాలనీవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రంగంపల్లిలో మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ఏరులై పారుతోంది. దీంతో గ్రామ ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోయారు. మురుగునీరు, రోడ్లపై పారడంతో చిన్న పిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారని, రోడ్డుపై నడవడానికి తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మురుగు కాలువలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

ఇంటి నంబర్లు ఇవ్వడంలో జాప్యం తగదు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

అనంతగిరి: మున్సిపల్ పరిధిలో కొత్తగా నిర్మించే ఇళ్లకు ఇంటి నంబర్లు ఇవ్వడంలో అవకతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్ నందు మున్సిపల్ రెవెన్యూ విభాగంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలో నివసిస్తున్న ప్రజలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సేవలు అందించాలన్నారు. మున్సిపాలిటికీ మరింత ఆదాయం వచ్చేలా రెవెన్యూ సిబ్బంది పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఆర్ఓ కృపాకర్, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

మామిడికి పచ్చపురుగు



మామిడిచెట్టుపై ఆకుపచ్చ పురుగు

దుద్యాల్ : ఆకుపచ్చ రంగులో ఉన్న పెద్ద పురుగు మామిడి చెట్టు ఆకులను తింటూ కనిపించింది. ఈ దృశ్యం దుద్యాల్ శివారులోని ఓ మామిడితోటలో మంగళవారం కనిపించింది. మామిడి చెట్టు ఆకు రంగు ఎలాగైతే ఉందో అచ్చం అదే రంగులో పురుగు ఉండడం విశేషం. మామిడి రైతులు ఇలాంటి చీడ పురుగులను కనిపెట్టడం చాలా కష్టం. ఈ పురుగుపై ప్రత్యేక దృష్టి పెడితే కాని గుర్తించలేమని రైతులు చెబుతున్నారు.

నేటి నుంచి విద్యుత్ మరమ్మతులు

కొడంగల్ రూరల్ : మండల పరిధిలోని రుద్రారం ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో నాలుగు రోజుల పాటు విద్యుత్ మరమ్మతులు కొనసాగుతాయని విద్యుత్ శాఖ ఏడీ నవీన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 19 నుంచి 22 వరకు ఉదయం 8–30గంటల నుంచి 10–30గంటల వరకు విద్యుత్ మరమ్మతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. రుద్రారం పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు.

కొండెక్కిన కూరగాయలు

ఏది కొన్నాలన్నా కిలో రూ.80 పైనే
- సామాన్యుడిపై పెనుభారం

వాతావరణ ప్రతికూల పరిస్థితులకు తోడు తగ్గిన కూరగాయల సాగుతో ధరలు అమాంతం పెరిగాయి. దీంతో సామాన్యుడిపై పెనుభారం పడుతోంది. కూరగాయలు కొనేట్టు.. తినేట్టు లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ధరలు పేద మధ్య తరగతి జీవితాల్లో కన్నీళ్లు తెప్పిస్తున్నాయి.



సంతలో ఆకుకూరలు అమ్ముతున్న వ్యాపారి



అంగట్లో అమ్మకానికి వచ్చిన కూరగాయలు

దుద్యాల్: మార్కెట్లో కూరగాయల ధరలు రోజు రోజుకు పెరుగుతుండటంతో జనాలు కొనలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధరలు చూస్తే కన్నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీన్స్ కిలో రూ.200, టామాట, కిలో రూ.100, పచ్చి మిర్చి కిలో రూ.120, కాకరకాయలు కిలో రూ.80, క్యారెట్ కిలో రూ.80, బెండకాయలు కిలో రూ.80, బీరకాయలు కిలో రూ.80, చిక్కుడు రూ.80 ఏ కూరగాయలను ముట్టుకున్న ధరలు భగ్గుమంటున్నాయి. వాస్తవంగా హోల్ సెలర్లు తక్కువ ధరకు అమ్మకాలు జరిపినా రిటైల్ వ్యాపారులు మాత్రం ధరలను ఆమాంతం పెంచేశారని ప్రజలు వాపోతున్నారు. ఆకుకూరల ధరలు స్థిరంగా ఉండడం, ఆకుకూరల వ్యాపారులు తక్కువ ధరకే అమ్మకాలు చేపట్టడంతో ఎక్కువ మొత్తంలో ఆకు కూరలు అమ్ముడు పోతున్నాయని వ్యాపారులు చెప్పుకొచ్చారు. పాలకూర, మెంతంకూర, పుంటి కూర, తెల్లగర్జల కూర, పాయిల్‌కూర, చుక్కకూర, తోటకూర వంటి ఆకుకూరలను రూ.10కే 3 నుంచి 5 కట్టల వరకు ఇవ్వడంతో కూరగాయలు కొనడానికి వచ్చిన జనాలు అమాంతం ఆకు కూరలు ఎక్కువ మొత్తంలో కొంటున్నారు. దీంతో ఆకుకూరల అమ్మకాలు బాగా పెరిగాయని వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జనాలు సైతం ఎంతో ఇష్టంగా ఆకుకూరలను తీసుకెళ్తున్నారు.

మళ్లీ దరఖాస్తుల స్వీకరణ



దౌల్తాబాద్‌లో దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు

దౌల్తాబాద్: ఎన్నికల హామీల అమలులో భాగంగా ప్రజాపాలన సేవా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రధానంగా గృహజ్యోతి, రూ.500లకే వంటగ్యాస్ పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గతంలో చేసుకున్న దరఖాస్తుల్లో తప్పుగా నమోదయిన లబ్ధిదారుల నుంచి మళ్లీ దరఖాస్తులను తీసుకుంటుంది. దీంతో ఎంపీడీఓ కార్యాలయంలోని సేవా కేంద్రానికి వచ్చిన దరఖాస్తులనుపరిశీలించి పథకాలను అందజేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు..

మండలంలో గతసారి స్వీకరించిన ప్రజాపాలనలో దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదుకు సమయం తక్కువగా ఉండడంతో ఇష్టానుసారంగా చేశారు. దీంతో రేషన్‌కార్డు నంబరు, గ్యాస్‌నంబర్లు తప్పుగా నమోదయ్యాయి. విద్యుత్ మీటర్ల నంబర్లు, గుర్తింపు సంఖ్యలో తేడాలు ఉండడంతో వీటిని సరిచేసుకోవడానికి వీలు కల్పించారు. ఈ సారిప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులు ఆదేశించారు. దీంతో ఒకటికి రెండు సార్లు సరిచూసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ప్రధానోపాధ్యాయుడు లాల్యనాయక్

దోమ : గ్రామాల్లోని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు లాల్యనాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కిష్టాపూర్ పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులతో కలసి ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందు తుందన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు ఇంగ్లీష్ మీడియంలో విద్యను అందించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెరువుకట్టపై గుంతను పూడుస్తాం

తహసీల్దార్ తారాసింగ్



గుంతను పరిశీలిస్తున్న తహసీల్దార్ తారాసింగ్

తాండూరు రూరల్: మండలంలోని అంతారం గ్రామశివారులో ఉన్న పెద్ద చెరువుకట్టపై ఏర్పడిన గుంతను పూడుస్తామని తాండూరు తహసీల్దార్ తారా సింగ్ అన్నారు. మంగళవారం ఆయన చెరువుకట్టపై ఉన్న భారీ గుంతను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు భారీ గుంత ఏర్పడిందని చెప్పారు. గుంతకు మరమ్మతులు చేయాలని ఇరిగేషన్ అధికారులకు లేఖ రాస్తామన్నారు. అనంతరం ఎల్మకన్నె శివారులోని కాగ్నానదిపై నిర్మించిన చెక్ డ్యాంను పరిశీలించారు. భారీ వర్షాలు కురిస్తే చెక్‌డ్యాం నిండి చుట్టూ పక్కల పొలాలు నీట మునుగుతాయని రైతు బసిరెడ్డి ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ చెక్‌డ్యాంను పరిశీలించి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతకుముందు ఇరిగేషన్ ఏఈ సాయిబన్న కూడా అంతారం చెరువుకట్ట వద్ద ఉన్న గుంతను పరిశీలించారు.

కిలో ఉల్లి రూ.50

పెద్దేముల్: ఉల్లిధర భగ్గుమంటోంది. గతవారం రోజుల క్రితం రూ.100కు నాలుగు కిలోలు పలికిన ఉల్లి మంగళవారం మండల కేంద్రంలో జరిగిన వారాంతపు సంతలో రూ.100కు రెండు కిలోల చొప్పున విక్రయాలు చేశారు. దీంతో సామాన్య ప్రజలు ధరను చూసి అవాక్కయ్యారు. పంట చేతికి వచ్చిన సమయంలో రూ.800 నుంచి రూ.1000 పలికిన క్వింటాల్ ఉల్లి రెండు మూడు నెలల్లో నాలుగు అంతలు పెరగడంతో రైతులు ఆశ్చర్యపోతున్నారు. పంట చేతికి వచ్చిన సమయంలో కనీసం పెట్టుబడి కూడా రావడం లేదు. పంట అమ్మిన తరువాత ధరలు నాలుగింతలు పెరగడంతో రైతు ఏలా బాగుపడుతారని మండలంలోని పలు గ్రామాల రైతులు అంటున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మర్పల్లి: మండల పరిషత్ కార్యాలయంలో నేడు (బుధవారం)ఉ.11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ బట్టు లలితరమేశ్ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులతో పాటు మండల, డివిజన్‌స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరు కావచ్చని ఆయన పేర్కొన్నారు.

పౌర సన్మాన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి

మర్పల్లి: వికారాబాద్ పట్టణంలోని కొండా బాలకృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నేడు (బుధవారం) మధ్యాహ్నం 12 గంటలకు బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పౌర సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పటోళ్ల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఎంపీగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి గెలుపొంది మొదటిసారిగా నియోజకవర్గానికి వస్తున్న నేపథ్యంలో మండల పార్టీ శ్రేణులు ముఖ్యకార్యకర్తలు, కొండా అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి పౌర సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు.

తరలిరావాలి

బంట్వారం: చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడంపై బుధవారం పౌర సన్మానం చేయనున్నట్లు బీజేపీ గీతా సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశంగౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలన్నారు.

సేవా కార్యక్రమాలు నిర్వహిస్తా



నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న సరళాశ్రీనివాస్‌రెడ్డి

బుయ్యని సరళాశ్రీనివాస్‌రెడ్డి

తాండూరు రూరల్: నియోజకవర్గంలోని ఇక నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని కాంగ్రెస్ మహిళా నేత బుయ్యని సరళాశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కర్ణాటక రాష్ట్రం మల్‌రోజ్‌కు చెందిన మల్లిఖార్జున స్వామి (అప్పాజీ) జన్మదినం సందర్భంగా మండలంలోని కరన్‌కోట్, చిట్టిఘనాపూర్ గ్రామంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజ్‌కుమార్, మాజీ ఎంపీపీ శరణుబసప్ప,హెచ్ఎం శ్రీనివాస్, నర్సిరెడ్డి,సినియర్ రిపోర్టర్ రవిశెట్టి ఉన్నారు.

జీవిత బీమాతో భరోసా



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న అధికారులు



బాధితులకు బీమా చెక్కు అందజేస్తున్న నరేందర్

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ జీవితబీమా పాలసీ తీసుకోవాలని, ఆ కుటుంబానికి పాలసీ కొండంత అండగా ఉంటుందని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ హైదరాబాద్ డీజీఎం నరేందర్ అన్నారు. మంగళవారం మండలం ముజాహిద్‌పూర్ గ్రామంలో వడిత్య బామినిబాయి గుండెపోటుతో మృతి చెందింది. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ అధికారులు మంగళవారం ముజాహిద్‌పూర్‌లో బాధిత కుటుంబీకులకు రూ.6లక్షల 3వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వివిధ సంస్థలు, బ్యాంకులు అందించే బీమా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీరామ్ ఇన్సూరెన్స్ అధికారులు శ్రీనివాస్, సురేష్, లక్ష్మయ్య, గఫూర్, మాజీ సర్పంచ్ శాంతిబాయితులసీరాం, అనంతయ్య, మనోహర్, గోవింద్ నాయకులు పాల్గొన్నారు.

జీవిత బీమాతో ప్రయోజనం

దోమ : గ్రామీణ ప్రజలు జీవిత బీమా పాలసీలు తీసుకుంటే ఎంతో ఉపయోగకరంగాఉంటాయని హైదరాబాద్ జోన్ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ డీజీఎం(డిప్యూటీ జనరల్ మేనేజర్)నరేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇటీవలే ఉదన్‌రావుపల్లి గ్రామానికి చెందిన శ్రీజంగం పాపయ్య గుండెపోటుతో మృతి చెందారు. పాపయ్య శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో రూ. 30 వేలతో జీవిత బీమా పాలసీని చేయించుకున్నారు. పాలసీ చేయించుకొని రెండు సంవత్సరాలలోపే ఆయన మృతి చెందాడు. దీంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బ్రాంచ్ అధికారులు పాపయ్య సతీమణి భాగ్యమ్మ నామిని కావడంతో జీవిత బీమాకు సంబంధించిన రూ. 3 లక్షల చెక్కును ఆమెకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీవిత బీమా ప్రతి ఒక్కరికి ఎంతో ఉపయోగపడుతందని తెలిపారు. ప్రతి ఒక్కరూ చేయించుకునేందుకు ముందుకు రావాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎం శ్రీనివాస్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పరిగి బ్రాంచ్ మేనేజర్ సురేశ్, ఏజెంట్లు మొగులమ్మ, లక్ష్మి, బాలమణి, భాగ్యలక్ష్మి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

దోమలకు ఆవాసాలుగా చెత్తకుప్పలు



జనావాసాల మధ్య చెత్తకుప్పలు

దుద్యాల్ : అసలే వర్షాకాలం.. పరిసరాలు శుభ్రంగా లేకుంటే దోమలు చేరి ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. కానీ, అలాంటివి ఏమీ పట్టించుకోకుండా మండలంలోని హస్నాబాద్ గ్రామంలో జనావాసాల మధ్య చెత్తను తొలగించకుండా చోద్యం చూస్తున్నారు. మత్స్యకార భవనం ముందు నుంచి పోయే మురుగు కాలువల నుంచి చెత్తను తీసి రోడ్డుపై వేశారు. రోజులు గడుస్తున్నా చెత్తకుప్పలను తొలగించడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రేపు రక్తదాన శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కుల్కచర్ల: మండల కేంద్రంలో రేపు (గురువారం) రక్తదాన శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల బీసీ సంఘ నాయకులు తమ్మలి రాంచంద్రయ్య, ముదిరాజ్ సంఘ మండల అధ్యక్షుడు చంద్రలింగం అన్నారు. మండల నాయకులు కుమ్మరి స్వామి పుట్టినరోజును పురస్కరించుకుని పీవీఆర్ గార్డెన్స్‌లో రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. కుమ్మరిస్వామి యువసేన సభ్యులు, బీసీ సంఘ నాయకులు కార్యక్రమానికి భారీగా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కృష్ణ, మురళి, అంజనేయులు, సత్యయ్య పాల్గొన్నారు.

నారాయణరెడ్డికి సన్మానం



నారాయణరెడ్డిని సన్మానిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

పెద్దేముల్: కోటపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన మంబాపూర్‌కు చెందిన నారాయణరెడ్డిని మంగళవారం పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ మురళీగౌడ్, మంబాపూర్ ముస్లిం వెల్ఫేర్ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. నారాయణరెడ్డి రైతులకు ఎల్లప్పుడు చెదోడు, వాదోడుగా ఉండే వ్యక్తిని కొనియాడారు. అలాంటి వారికి చైర్మన్‌గా రిజర్వేషన్ అనుకూలిస్తే చైర్మన్ పదవి కూడా కట్టబెట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్, పెద్దేముల్ మండల కుర్వ సంఘం నాయకుడు రవి శంకర్, వార్డు సభ్యులు ఎండీ మోహిద్, గ్రామకమిటీ అధ్యక్షుడు ఎండీ మోహుస్, పెంటప్ప తదితరులు పాల్గొన్నారు.

ఓం ట్రేడింగ్ కంపెనీకి నోటీసులు



యజమానికి నోటీసు అందిస్తున్న ఏఓ లావణ్య

కొడంగల్ : పట్టణంలోని ఓం ట్రేడింగ్ కంపెనీ ఫర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్స్ దుకాణానికి వ్యవసాయాధికారిని లావణ్య నోటీసులు జారీ చేశారు. మంగళవారం ఆమె ఓం ట్రేడింగ్ కంపెనీని సందర్శించి ఎరువులు, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. దుకాణంలో ఉన్న 102మెట్రిక్ టన్నుల యూరియా, 55మెట్రిక్ టన్నుల డీఏపీ, 68మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువు విక్రయాలను నిలిపివేయాలని నోటీసు ఇచ్చింది. అలాగే, దుకాణంలో ఉన్న అన్నపూర్ణ కంపెనీకి చెందిన విజయదుర్గా ఏపీ 130రకం వరి విత్తనాలను క్రయవిక్రయాలు జరపొద్దని సూచించారు. ఈ ఎరువులు, విత్తనాలను 21రోజులపాటు అమ్మకాలను నిలిపివేయాలని నోటీసులో పేర్కొన్నారు.

దోబూచులాడుతున్న వరుణుడు

- 70 శాతం పత్తి విత్తిన రైతులు...
- మొలకెత్తని విత్తనాలు
- ఆందోళనలో అన్నదాతలు



దారూరు: పెసర మొలకెత్తిన నీరు నీరసించిన మొక్కలు



ఎన్కేపల్లి: పత్తి విత్తనాలు వేస్తున్న కూలీలు

ధారూరు: వరుసగా పది రోజుల నుంచి వర్షాలు కురవకపోవడంతో రైతులు విలవిలలాడుతున్నారు. మేఘావృతమై ఆకాశమంతా మంగళవారం వర్షం పడుతుందని ఆశించినా వరుణదేవుడు కరుణ చూపలేదు. వర్షాభావ పరిస్థితులు ముఖ్యంగా పత్తి రైతును చిత్తు చేస్తున్నాయి. ధారూరు మండలంలోని దాదాపు 28 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగుచేస్తున్న రైతన్న ఒక్క పత్తి పంటనే 70శాతం విత్తారు. రూ. వేల నుంచి రూ. లక్షల పెట్టుబడులు పెట్టి విత్తనాలు విత్తగా 30 శాతం పొలాల్లో మొలకెత్తగా 70 శాతం విత్తనం పొలాల్లోనే ఉండిపోయింది. ఈనెల 9న కురిసిన వర్షంతో రైతులు ముక్కుమడిగా విత్తనాలు వేశారు. అంతకు ముందు చెల్కనేలల్లో వేసిన పంటలు మొలకెత్తగా వర్షం తర్వాత వేసిన విత్తనం మొలకెత్తకుండా మొరాయిస్తుందని రైతులు వాపోయారు. సాగు చేసిన పంటల్లో ఎక్కువగా పత్తి తర్వాత కంది, మొక్కజొన్న, మినుము, పెసర లాంటి ప్రధాన పంటలున్నాయి. వర్షాలు లేక చెరువులు, కుంటలు, ప్రాజెక్టులో నీరు చేరక వరిసాగు మరింత ఆలస్యమైయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. అడపా దడపా వానలు కురుస్తాయని ఆశించిన రైతులకు వానలు చుక్కలు చూపిస్తున్నాయి. వేసిన విత్తనాలు భూమిలోనే ఉండిపోవడంతో వర్షాలు ఎప్పుడు పడతాయి, వేసిన విత్తనాలు మొలకెత్తుతాయా లేక రెండోసారి విత్తనం వేయాల్సి ఉంటుందా అనే మీమాంసంలో కొట్టుమిట్టాడుతున్నారు.

ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి

పత్తిని సాగుచేసిన రైతులు ఎకరాకు రూ.15 వేలకు పైగానే వ్యయం చేశారు. దుక్కి దున్నడం నుంచి విత్తనం వేసేవరకు 80 శాతం రైతులు ట్రాక్టర్లకు, కూలీలకు ఎక్కువ డబ్బులు ఇచ్చి విత్తనాలు వేశారు. బ్యాంకులు అప్పులివ్వకపోవడం, రుణమాఫీ కాకపోవడం, అధిక వడ్డీలకు అప్పులు తీసుకురాక తప్పలేదు. బ్యాంకులు ఇచ్చిన రుణాలను ఆయా బ్రాంచుల అధికారులు తెలివిగా రెన్యువల్ చేయించి చేతులు దులుపుకొంటున్నారు. ఈ సారి సకాలంలో వర్షాలు పడితేనే విత్తనం మొలకెత్తి పంట దక్కుతుందని, లేకపోతే నష్టపోక తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు వేసి వారం దాటిన వానలు లేక మొలకెత్తలేవని, ఒకవేళ ఆలస్యంగా వర్షాలు పడిన మొలకెత్తిన మొక్క బలహీనంగా ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితులు నుంచి అసలు గట్టెక్కుతామా లేదా అనే మీమాంసంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

ఖరీఫ్ కష్టాలు

మోమిన్‌పేట: ఖరీఫ్ సాగుకు వరుణదేవుడుయ ముఖంచాటేశాడు. దోబూచులాడుతున్నారు. రోహిణి కార్తెలో కురిసిన ఒకటి రెండు వర్షాలకు రైతన్న పొలాలను దున్నుకొని విత్తనాలు విత్తుకోవడానికి సిద్ధం చేసుకున్నారు. మృగశిర కార్తెలో గతవారం రోజుల క్రితం ఒక వర్షం కురవడంతో రైతులు కొంతమంది విత్తనాలు విత్తుకున్నారు. ఆ తర్వాత వరుణదేవుడు కనికరించలేదు.. చాలా మంది రైతులు విత్తనాలు విత్తుకోలేదు.. ఇంకో వర్షం కురిస్తే గాని విత్తనాలు మొలకెత్తవని రైతులు పేర్కొంటున్నారు. మండల పరిధిలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో ఎక్కువ విస్తీర్ణం (తెల్ల బంగారం) పత్తిని సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మొక్కజొన్న, పప్పు దినుసులైన పెసర, మినుము, కంది, బొబ్బర్ల పంటలను సాగు చేసేందుకు రైతులకు అడవి పందులు, నెమలల బెడద ఉంది. అందుకు రైతులు వర్షాధారంగా పూర్తిస్థాయిలో పత్తిని సాగు చేసేందుకే మొగ్గు చూపుతున్నారు. జూన్ నెల చివరి వరకు విత్తనాలను విత్తుకోనేందుకు అవకాశం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్న రైతులు మాత్రం తొందరగా విత్తుకోనేందుకు మొగ్గుచూపుతున్నారు. మృగశిర కార్తె వెళ్లే సమయానికి వరుణదేవుడు కరుణించి వర్షం కురిస్తే సకాలంలో విత్తుకొవచ్చని రైతులు కోరుతున్నారు.